సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ రక్షణ శాఖకు సంబంధించిన సామగ్రిని చెన్నైకి తరలిస్తున్న నేపథ్యంలో పోలీసు, ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది ఎస్కార్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో రూ.వేలకోట్లు నగదు తరలిస్తున్నారంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్ పేర్కొన్నారు. దేశ రక్షణకు సంబంధించి సామగ్రి తరలించే సమయంలో పక్కా ప్రణాళికతో భద్రతా ఏర్పాట్లు ఉంటాయని, సామగ్రి వెళ్తున్న రూటులో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలన్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాలు, రక్షణ శాఖ విజ్ఞప్తి మేరకు ఆర్మీతోపాటు పోలీస్ ఎస్కార్ట్ ఇచ్చామని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే సోషల్ మీడియా వేదికగా అసత్యాలు, అభూతకల్పనలు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైలవరానికి మరమ్మతులేవీ?

- రూ.80 కోట్లతో ప్రతిపాదనలు అందజేత
- ఏడాదిన్నరగా కోల్డ్‌స్టోరేజీలోనే
- టెక్నికల్ విభాగం మోకాలడ్డు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో మైలవరం ప్రధానమైంది. ఇటువంటి ప్రాధాన్యత ప్రాజెక్టు రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాల ధాటికి మరమ్మతులకు గురైంది. రాయలసీమకే తలమానికమైన గండి కోట రిజర్వాయర్‌కు అనుసంధానమై ఉంది. 9.99 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో కూడిన 74 వేల ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు మరమ్మతులకు రూ.80 కోట్లతో కూడిన ప్రతిపానదలు ఏడాదిగా ఆమోదానికి నోచుకోవడం లేదు. గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా మైలవరం రిజర్వాయర్ రివిట్‌మెంట్ దెబ్బతింది. రిజర్వాయర్ బ్యూటిఫికేషన్ నిమిత్తం పంపించిన ప్రతిపాదనలకు రిమార్క్స్ పేరిట పాలనా యంత్రాంగం వెనక్కి పంపించింది. జిల్లా నీటి పారుదల శాఖ రిమార్క్స్‌ను సవరించించిన ప్రతిపాదనల్ని మళ్లీ పంపించింది. నెలల తరబడి ఎటువంటి కదలిక లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

మరమ్మతులకు మోక్షం లేనట్లే!

మైలవరం రిజర్వాయర్‌కు రివిట్‌మెంట్ దగ్గర నుంచి గెస్ట్‌హౌస్, గోడలు, గేట్లు, కట్ట, లెఫ్ట్ బ్లాంక్, ప్రొటెక్షన్‌వాల్, ఫ్లడ్‌గేట్, లైటినింగ్, రహదారి, గేట్లు, ఉత్తర, దక్షిణ కాల్వలు మొదలగు నిర్మాణ పనులు దెబ్బతిని శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. గతేడాది లెఫ్ట్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు, ఈదర మొక్కలను తొలగించారు. మళ్లీ యథాతథ పరిస్థితులు నెల కొనడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్పందించి జిల్లా నీటి పారుదలశాఖ సహకారంతో రూ.80 కోట్లతో ప్రతిపాదనలను అందజేశారు. ఆమేరకు పాలనాపరమైన ఆమోదం లభించినట్లేనని భావించింది.

> మైలవరం రిజర్వాయర్ మరమ్మతులకు నిరీక్షణ తప్పడం లేదు. 2022 ఆగస్టులో జిల్లా నీటిపారుదల శాఖ రూ.80 కోట్లతో ప్రతిపాదనలు అందజేసింది. రాష్ట్ర ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగం రిమార్క్స్ పేరిట వెనక్కి పంపించింది. జిల్లా నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్‌ను పరిశీలించి మళ్లీ ప్రతిపాదనల్ని పంపించింది. అయి నప్పటికీ సుమారు ఏడాదిన్నరగా పాలనామోదానికి నిరీక్షించాల్సి వస్తోంది. పాలనా మోదం అనంతరం సాంకేతిక అనుమతులు, టెండర్లు, అగ్రిమెంట్ల వ్యవహారం పూర్తి చేసే సమయానికి పుణ్యకాలం ముగియనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో మైలవరం మరమ్మతులు ఇప్పట్లో లేవనే ఇంజినీరింగ్ వర్గాలు పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

ఎస్‌సిఎల్‌టి విభాగానికి ఫైలు చేరుకున్నట్లు సమాచారం.

ఏడాదిన్నరగా కోల్డ్‌స్టోరేజీలోనే

గతేడాది ఆగస్టు నుంచి అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతుల కోసం నీటిపారుదల శాఖ నిరీక్షిస్తోంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్ పేరిట అనుమతులు ఇవ్వడంలో కాలయాపన చేస్తోంది. ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన భారీ ప్రాజెక్టు పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన మధ్య తరహా, చిన్నతరహా ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే. రాబోయే వేసవి సీజన్‌లో మరమ్మతులకు అవసరమైన వాతావరణం ఏర్పడింది. వేసవి సీజన్‌లో మరమ్మతులు చేసి వర్షాకాలం నాటికి సిద్ధం చేసుకునేందుకు అవకాశం ఉంది. లేనిపక్షంలో ఆగష్టు, అక్టోబర్, నవంబర్ మాసాల్లో వరదలు వస్తే మైలవరం ప్రాజెక్టు పరిస్థి తేమిటో తెలియడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పందించి మైలవరం సాగునీటి ప్రాజెక్టు మరమ్మతుల పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. దీనిపై బాధ్య ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సంప్రదించగా ప్రతిపాదనలు ఆమోదం లభించిన వెంటనే పనులు చేపడతామని పేర్కొనడం గమనార్హం.

మైలవరం డ్యామ్‌లో తగ్గిన నీటి మట్టం

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వ హించాలని జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ సంబ ంధిత అధికారులను ఆదేశి ంచారు. శు క్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపె నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం కోర్సులకు సంబంధించి మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలుం టాయన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9 నుండి 12 వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 69 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు, అత్యవసర మందులతో పాటు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకుని ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభానికి అర గంట ముందు నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులకు రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండేలా ఉదయం 6 నుంచి 8 గంటల మధ్యలో బస్సులను అన్ని రూట్లలో నడపాలని, పరీక్ష పూర్తి అయ్యాక కూడా బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఆర్‌ఐఒ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పరీక్షల కోసం 3 ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలను పూర్తిగా మూసి వేయాలని, పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారం ఎంతైనా అవసరం అని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో డిఇఒ రాఘవ రెడ్డి, పోలీస్, ఎపిఎస్ ఆర్‌టిసి, విద్యుత్ శాఖల అధికారులు పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్ : సిపిఎం

బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ పూలే సర్కిల్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియా వంటి ఎరువులకు రాయి తీలు తగ్గించడం దారుణమని తెలిపారు. అంగన్‌వాడీలు, పంట బీమాకు కోత, ఉపాధి హామీ, పీఎం కిసాన్‌కు పెంపు లేదని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో సామాన్య, పేదలు, రైతులకు సంబం ధించిన వాటిపై కేంద్ర ప్రభుత్వం కోత విధించిందన్నారు. ఆహారం, వంట గ్యాస్, పెట్రోలియం, యూరియా వంటి ఎరువులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గాయని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో సామాన్య, పేద ప్రజలకు ఎటువంటి ఉపశమనం కలగలేదని పేర్కొన్నారు. ఆయా వర్గాలకు సంబంధించిన రంగాల కేటాయింపుల్లో కోత విధించారని తెలిపారు. పిఎం కిసాన్, ఉపాధి హామీకి ఎటువంటి పెంపుదల లేదు. గతంలో కేటాయించిన వాటినే కాపీ, పేస్టు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రామ్మోహన్, మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి-కలసపాడు

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి

మండలంలో మహిళా భివృద్ధికి జగనన్న పెద్ద పీట వేశారని ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 4వ విడత ఆసరా చెక్కులను వారు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సంరద్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా విద్యా, వైద్య, సామాజిక సాది కారిక రంగంలోనూ మేము సైతం అంటూ ముందుకు దూసుకెళ్తున్నారని చెప్పారు. రాష్ట్ర పతి నుంచి ఎంపిటిసి, సర్పంచుల వరకు ఎక్కువ సీట్లు మహిళలకే కేటా యిం చారని పేర్కొన్నారు. అనంతరం యువ నేత ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల, దృష్ట్యా ఇంటింటికి వెళ్లి, అప్పటి కప్పుడే వారి సమస్యలకు తగిన పరి ష్కారం చూపుతామన్నారు. గ్రామ వాలంటరీ స్థాయి నుంచి అటు సచి వాలయ ఉద్యోగుల వరకు నిరంతరం ప్రజ లకు అందుబాటులో ఉంటున్నారని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ డి.సి గోవింద రెడ్డి మాట్లాడుతూ 2004లో డ్వాక్రా గ్రూపులు సంఘాలలో 60 లక్షల మంది ఉండేవారని, 2019లో 4,460 డ్వాక్రా గ్రూపు సంఘాలు ఉన్నా యన్నారు. 2024వ సంవత్సరం వచ్చే సరికి 4, 468 నుంచి 6,164 వరకు సుమారు 1700 సంఘాలు పెరిగాయని ఈ సందర్భంగా తెలిపారు. బద్వేల్ నియో జకవర్గంలో 2 లక్షల 20 వేల మంది ఓటర్లు ఉండగా నలుగురిలో ఒక డాక్రా మహిళా ఉన్నారని మీరందరూ కలిసి 61, 640 మంది ఉన్నారని తెలిపారు. వీరికి బ్యాంకు లింక్స్ ద్వారా సుమారు రూ.8 కోట్లకు పైగా రుణాలు మంజూరు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో, కలసపాడు ఎంపిపి బోధన బోయిన నిర్మల నారాయణ, కలసపాడు మండల ఇన్‌ఛార్జి అంకన్న గురువురెడ్డి, రాజుపాలెం సర్పంచి సుధా రామకృష్ణారెడ్డి, కలసపాడు సర్పంచ్ శివ లీల, ఎంపిటిసి కురుషద్ బేగం, ఎపిఎం సుబ్బరాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ఇఒపిఆర్‌డి మురారి, ఎంపిడిఒ కోటేశ్వరరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెడ్డి నారాయణరెడ్డికి ఘన నివాళి

కడప అర్బన్ : 1952లో వచ్చిన కరువు కన్నీటిగాథను 'రాయలసీమ రైతు' కావ్యంగా చిత్రించిన రైతుకవి బైరపురెడ్డి రెడ్డినారాయణ రెడ్డి 102వ జయంతిని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి ముందుగా బైరపురెడ్డి రెడ్డినారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ రెడ్డినారాయణ రెడ్డి రాయచోటికి సమీపంలోని రెడ్డివారి పల్లెకు చెందినవారని, వ్యవసాయ కుటుంబంలో జన్మించారని అన్నారు. ఆయన సంగమేశ్వర శతకం, తలపోతలు, రాయలసీమ రైతు అనే మూడు పద్యకావ్యాలు రచించినప్పటికీ 1952లో రాయలసీమలో వచ్చిన కరువు విషాద అనుభవాలతో రచించిన 'రాయలసీమ రైతు' ఆయన రచనల్లో మణిపూసలాంటిదని అన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు జి.హరిభూషణ్‌రావు, సిపి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, పాఠకులు డి.దివికుమార్, ప్రకాశరావు, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి నెల 9న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 08562-258622, 244622 ద్వారా కానీ, districts.ecourts. gov.in/Kadapa, dlsakdp@gmail.com ద్వారా కానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణంపై కాలనీ వాసుల హర్షం

ప్రజాశక్తి - కడప

రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు వేయడంపై కృప కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కడప నగరం, 48 డివిజన్, కృపా కాలనీలో నడవడానికి సరైన దారి లేక స్థాకులు ఇబ్బందులు పడు తుండేవారు. ఈ నేపథ్యంలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మలు కాలనీ వాసులతో కలిసి ఇటీవల కార్పొరేషన్ స్పందన కార్యక్రమంలో కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ కు తమ సమస్యలను వినిపించుకున్నారు. తక్షణమే స్పందించిన అధికారులు డిఇ, హుసేన్, ఎఇ నాగార్జున, సచివాలయ సిబ్బంది ప్రకాశ్, రోశయ్యలు కృపా కాలనీని సర్వే చేసి ఇక్కడ రోడ్డును నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. శుక్రవారం కాంట్రాక్టర్ ఓబుల్ రెడ్డి తక్షణమే కృపా కాలనీలో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పాస్టర్ పి.మహేష్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప : ప్రతి ఒక్క మోటార్ ద్విచక్ర వాహనదారులూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఆర్‌కె ల్యాబ్స్ అధినేత. కొండ సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయల్ రషీద్ అసోసియేషన్ వారు ముదిరించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి చిన్న వయసు వారు ద్విచక్ర వాహనం నడపడం నేరమని అన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి సెవెన్ రోడ్స్ సర్కిల్ వరకు ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను యువతకు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ రాయల్ కరీముల్లా, సూరి, వేమారెడ్డి, ప్రసాద్, జావిద్ బాషా పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందించాలి

కలసపాడు : ప్రస్తుత వైసిపి అరాచక పాలనను అంతమొందించాల్సిన అవసమెంతైనా ఉందని బద్వేల్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బొజ్జ రోషన్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నారెడ్డిపల్లెలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించాచు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేవారని, ప్రస్తుతం వైసిపి హయాంలో అరాచకాలు ఎక్కువైపోయాయని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సోమిరెడ్డి సోమిరెడ్డి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, సలహాదారుడు నాగేశ్వరరావు, చెన్నారెడ్డిపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షులు, ముత్తుముల చంద్రశేఖర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, ముత్తుముల, సూర్యనారాయణ రెడ్డి, జార్జి, ప్రభాకర్, శేఖర్ రెడ్డి, కలసపాడు గ్రామ కమిటీ, ఇన్‌ఛార్జి నాగేంద్ర, నారాయణ రెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ కార్యదర్శి సత్యం, రవి, పాల్ రమేష్ పాల్గొన్నారు.

రికవరీ మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

కడప అర్బన్ : చోరీకి గురైన మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మొబైల్ పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన వాటిని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉందని చెప్పారు. రూ.2 రెండు కోట్లు విలువచేసే 650 మొబైల్స్ రికవరీ చేశారని తెలిపారు. సెల్‌ఫోన్ దుకాణం దారులు, వ్యక్తులు అపరిచితుల నుంచి అమ్మే ఫోన్లు కొనుగోలు చేయవద్దని సూచించారు. అమ్మేవారు పరిచయం ఉన్నవారైనా సరే బిల్లులు మొబైల్ ఫోన్ వివరాలు కలిగిన బాక్స్ ఉంటేనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా బాధితులకు కడప పోలీసులు న్యాయం చేస్తున్నారని చెప్పారు. సెల్‌ఫోన్ దొంగతనానికి గురైన, మిస్సయిన సమీప పోలీస్ స్టేషన్‌లో వెళ్లి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వెంటనే సిమ్ము ఐఎంఇఐ నెంబర్లు బ్లాక్ చేయాలని అన్నారు. రికవరీలో చురుకైన పాత్ర పోషించిన సైబర్ విభాగం సిఐ శ్రీధర్ నాయుడు, మధు మల్లేశ్వర్ రెడ్డి, ఎస్సై జీవన్ రెడ్డి, సిబ్బందిని అభినందించారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - వల్లూరు

విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు వృత్తిని పెం పొందించుకోవాలని ఎపి మోడల్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. సురేష్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఐటిఎలక్ట్రికల్ ప్రేరణకు సంబంధించిన ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపురంలోని సిఎస్ ఎస్ఆర్అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలను, విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు మాట్లాడుతూ ఒకేషనల్, టెక్నికల్ కోర్సెస్ ద్వారా ఉన్నత విద్య ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు శోభన, చారి, ఎన్. శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష

కడప అర్బన్ : 10వ తరగతి విద్యార్థులకు ఏకవాక్య సమాధానాల రూపంలో జిల్లా స్థాయి 'ప్రజ్ఞా వికాస' పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సునీల్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ప్రజ్ఞా వికాస పరీక్ష కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ యుటిఎఫ్ విద్యారంగం అభివృద్ధికోసం అనేక ప్రత్యామ్నాయ విధానాలు సూచిస్తున్నాయని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులందరూ హాజరు కావాలని కోరారు. అత్యున్నత ప్రతిభ కనబరిచిన మొదటి పదిమంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

మలబార్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన

కడప అర్బన్ : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఈనెల 2 నుంచి 11 వరకు వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంస్థ స్టోర్ హెడ్ లెసన్ సత్యన్ తెలి పారు. శుక్రవారం కోటిరెడ్డి సర్కిల్ వద్దనున్న మలబార్ షో రూమ్‌లో వెండి ఆభర ణాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనలో భాగంగా ప్రతి రూ. 5వేల కొనుగోలు పై రూ. 500 ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వినియో గదారులకు 10 నాణ్యమైన వాగ్దా నాలను అందిస్తున్నామని తెలిపారు. వార్షిక ఆదాయంలో సామాజిక బాధ్యతగా ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారత, పర్యావరణ రక్షణ విభాగంలో తమ వంతు సాయం అందజేస్తున్నామని చెప్పారు.

వెండి ఆభరణాలు ప్రదర్శిస్తున్న మేనేజ్మెంట్, శ్రేయోభిలాషులు

ఎఎస్‌పి(అడ్మిన్)గా లోసారి సుధాకర్ బాధ్యతలు స్వీకరణ

కడప అర్బన్ : జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా లోసారి సుధాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. లోసారి సుధాకర్ 1995 బ్యాచ్‌లో ఎస్ఐగా ఎంపికై జిల్లాలోని బ్రహ్మంగారి మఠం, కమలాపురం, ముద్దనూరు, సి.కె దిన్నె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. సిఐగా ఉద్యోగోన్నతి పొందిన అనంతరం లక్కిరెడ్డిపల్లె, మహిళా పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వ ర్తించారు. డిఎస్‌పిగా ఎస్‌సి, ఎస్‌టి సెల్, ప్రొద్దుటూరు, ఎసిబి, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్‌లో పనిచేశారు. చిత్తూరు అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా పని చేస్తూ జిల్లాకు వచ్చారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కడప : ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని స్వయం సహాయక సంఘం (మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని ఆకుల వీధిలో, మాసాపేట గాజుల వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో రేణుక ఎల్లమ్మ, సులోక్షలమ్మ ఏర్పాటుచేసిన పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. మహిళలు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా పరిపుష్టిని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. అర్హత గల స్వయం సంఘాలకు రూ.20 లక్షలు ప్రభుత్వ రుణాలు ఇస్తుందని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణతో మహిళలు తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని అన్నారు. పేపర్ ప్లేట్ల మిషనరీ తయారీ కోసం ప్రభుత్వం రూ. 2.60 లక్షలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షంషీర్, ఎల్ హెచ్ నాగరాజు, ఇఫ్రాయిమ్, ఎం హరి ప్రసాద్ రెడ్డి, పట్టణ ఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆత్మీయ మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - చెన్నూరు

కడప డిఎస్ఆర్ కల్యాణమండపంలో ఈ నెల 4న నిర్వహించబోయే యాదవ ఆత్మీయ మహాసభను కమలాపురం నియోజకవర్గంలోని యాదవులందరూ పాల్గొని జయప్రదం చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాదవులందరిని ఒక తాటిపైకి తెచ్చి పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డికి మద్దతుగా అందరూ కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కమలాపురం నియోజకవర్గంలోని పంచాయతీ సర్పంచి నుంచి రాష్ట్రస్థాయి నాయకులు వరకు యాదవులకు ప్రాముఖ్యత కల్పించారని ఆయన అన్నారు.

తహశీల్దార్‌గా ప్రకాష్‌బాబు

చెన్నూరు : మండల నూతన తహశీల్దార్‌గా ప్రకాష్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న పటాన్ ఆలీఖాన్ తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో డిప్యూటీ తాసిల్దార్ వెంకటరమణ, వీఆర్వోలు సుధీర్ కుమార్, వెంకటసుబ్బయ్య, రసూల్, ఆర్ఐ సౌజన్య రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కులగణన పరిశీలన

చెన్నూరు : మండలంలో జరుగుతున్న కుల గణన కార్యక్రమాన్ని ఎఎస్‌డబ్ల్యూ ఒ. లక్ష్మినారాయణ శుక్రవారం పరిశీలించారు. బలిసింగాయపల్లె పంచాయతీలో నిర్వహిస్తున్న కుల గణనను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలిచ్చారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - కడప

ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా కావాలన్నా బిజెపి, 15 సంవత్సరాలు కావాలన్నా టిడిపి, 25కు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదాను తెస్తామన్న వైసిపి పార్టీలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని వాపోయారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంజీవిని లాంటి ప్రత్యేక హోదాను వైసిపి, టిడిపి పార్టీలు గాలికి వదిలేశాయని ఘాటుగా విమర్శించారు. ప్రత్యేకహోదా కోసం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి ఢిల్లీలో చేపట్టిన నిరాహార దీక్షకు రాష్ట్ర ప్రజలందరూ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మాత్రమే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే సత్తా ఉందని ఈ సందర్భంగా వారు అన్నారు.

విస్తారంగా నువ్వుల పంట సాగు

ఎకరాకు రూ.3 వేలు పెట్టుబడి - ఐదు క్వింటాళ్ల దిగుబడి - క్వింటా ప్రస్తుతం ధర రూ.16 వేలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లి, పులివెందుల, తొండూరు మండలాల్లో రైతులు నువ్వు పంటను విస్తారంగా సాగు చేశారు. నువ్వు పంట సాగుకు పెట్టుబడి తక్కువ కావడం.. ఆదాయం అధిక కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది అటు ఖరీఫ్, ఇటు రబీలోగానీ వరుణదేవుడు కరుణించలేదు. ఏదో తుఫాన్ పుణ్యమా అని డిసెంబర్‌లో వర్షాలు పడడంతో భూమి పదునైంది. ఈ పరిస్థితుల్లో రైతులు నువ్వులు, జొన్న, బుడ్డశనగ తదితర పంటలను సాగు చేశారు. అయితే పంటలు బాగా వస్తున్న దశలో వరుణదేవుడు ముఖం చాటేయడంతో పిబిసి కింద నీళ్ల అధికారులు వదలడంతో ఆ నీటితో రైతులు తమ పంట పొలాలను తడుపుకుంటున్నారు. వ్యవసాయ సీజన్‌లో అనుకున్నంత మేర వర్షాలు పడకపోవడంతో భూములు ఎడారిని తలపిస్తున్నాయి. కానీ డిసెంబర్‌లో తుఫాన్ వల్ల పదును వర్షం కురవడంతో రైతులు ఈ పంటలను సాగు చేశారు. పంట సాగు చేసేప్పటి నుంచి ఇప్పటి వరకు వరుణదేవుడు కరుణించకపోవడంతో, పులివెందుల బ్రాంచి కెనాల్ ద్వారా కాలువలకు అధికారులు నీళ్ల విడుదల చేయడంతో మోటర్లు, ఇంజన్ల ద్వారా రైతులు పంట పొలాలను తడుపుకుంటున్నారు. ఇదిలా ఉండగా ముఖ్యంగా రైతులు నువ్వుల పంటను విస్తారంగా సాగు చేశారు. ఈ పంటకు పెట్టు బడి తక్కువ ఆదాయం ఎక్కువ. ఎకరా నువ్వుల పంట సాగు చేయాలంటే రెండు కిలోల నువ్వులు రూ.500, పంట విత్తనం కోసం రూ.500, కలుపు, ఉడుపు తీయ డానికి మరో రూ.1000, తెగుళ్ల నివారణ కోసం మరో రూ.వెయ్యి ఖర్చవుతుంది.

సాగులో ఉన్న నువ్వు పంట

నువ్వుల పంట సాగు కోసం రూ.మూడు వేలను రైతులు ఖర్చు చేశారు. అయితే ఎకరానికి దిగుబడులు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.16 వేల నుంచి రూ.20 వేల ధర పలుకు తోంది. ఈ పంట వల్ల తమకు ఆదాయం రానుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నాలుగు మండలాల్లో సుమారు 1000 ఎకరాల్లో రైతులు నువ్వుల పంట సాగు చేశారు. ఏదేమైనా నువ్వుల పంట సాగు చేసిన రైతు లకు ఎకరానికి సుమారు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం రానుంది.

మైదుకూరు ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు ఎవి రమణ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గం 50ఏళ్లుగా ఏవిధమైన అభివృద్ధి చెందలేదని, ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కర్మాగారాల రూపంలో, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పన రూపంలో, విద్య, వైద్య సౌకర్యాల ఏర్పాటులో మైదుకూరు ప్రాంతంలో ఏలాంటి పురోగతి జరగలేదన్నారు. పాల కర్మాగారం, పశుదాన కేంద్రం మూత పడ్డాయన్నారు. నియోజకవర్గంలో 70 శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారేనన్నారు. వ్యవసాయ అనుబంధ కర్మాగారాలు, ప్రభుత్వ గోడౌన్‌లు లేవన్నారు. కెసి కెనాల్ రైతులకు రాజోలి ప్రాజెక్టును నిర్మించాలన్నారు. మరో ప్రాజెక్టు తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో నీరు ఉన్న రైతుల పొలాలకు పూర్తి స్థాయిలో కాలువలు లేకపోవడంతో నీరందని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో స్కానింగ్, ఎక్స్ రే వంటి యంత్ర పరికరాలు లేవన్నారు. కార్యక్రమంలో దువ్వూరు అజయ్‌బాబు, ఆర్‌టిసి రిటైర్డ్ యూనియన్ నాయకులు షామీర్, నాగరాజు, ఆర్మీ రిటైర్డ్ యూనియన్ నాయకులు రామ సుబ్బారెడ్డి, విఆర్వో రిటైర్డ్ యూనియన్ నాయకులు పుష్పరాజ్, ఎంఆర్పీఎస్ నాయకులు మిద్దె వెంకటరమణ, ఆటో యూనియన్ నాయకులు బాషా, మక్బుల్, రైతు సేవా సమితి నాయకులు సహదేవుడు, శ్రీనివాసులు, రాజా, జయనంద్, రాఘవ పాల్గొన్నారు.

పోస్టులు పెంచి మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పోస్టుల సంఖ్యను పెంచి మెగా డిఎస్‌సి విడుదల చేయాలని విద్యార్థి యువజన సంఘాల బాధ్యులు ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఎస్‌సి ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే నాలుగేళ్ల నుంచి ఊరిస్తూ కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. డిఎస్‌సి అభ్యర్థుల ఆవేదనను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని జూన్ వరకు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ యువజన నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి పేరుతో సిఎం దగా : డివైఎఫ్ఐ

మెగా డిఎస్‌సి విడుదల చేస్తానని మినీ డిఎస్‌సితో యువతను సిఎం దగా చేశారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సి ఇస్తానని హామీ ఇచ్చి నాలుగేళ్లయిందన్నారు. తర్వాత ఉసూరుమనిపించేలా 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. డివైఎఫ్ఐ పోరాట ఫలితంగా డిఎస్‌సి ప్రతిపాదనని మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, సూరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసీశ్వర్ యాదవ్

దుప్పట్లు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి

నిరాశ్రయులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలోని మహాత్మా గాంధీ నిరశ్రాయుల వసతి గృహంలో ఉండే పేదలకు శుక్రవారం ఖాజీపేట మండలం బి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ గోసుల విజయరాఘవరెడ్డి ఆర్థికసాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. వీటిని దాత తండ్రి విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ జి.వీరరాఘవరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్స్ అధ్యక్షుడు పెరుగు కృష్ణయ్య యాదవ్, హెల్పర్ మేనేజర్ వెంకట శివయ్య, వీరరాఘవ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర సూచించారు. మైదుకూరు మున్సిపాలిటీలో తాగునీటిపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన మున్సిపాలిటీ అధికారులు, పంపు ఆపరేటర్‌లతో వార్డుల వారీగా సమీక్షించారు. తాగునీటి సమస్య ఉన్న వార్డులో సత్వరమే పరిష్కార చర్యలు చేపట్టేలని సూచించారు. నీటి సమస్య ఉన్న బోర్లలో పైపులు దింపాలని, అడ్డంకులు ఉన్న చోట తొలగించాలని, కొత్త బోర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులకు సూచించారు. పంపు ఆపరేటర్లు పనిపట్ల అలసత్వం వహించకుండా నిరంతరం పర్యవేక్షణ చేసి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా మున్సిపాలిటీ అధికారుల, చైర్మన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఆపరేటర్లకు తెలిపారు. వేసవిలో నీటి సమస్య రాకుండా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, పంపు ఆపరేటర్లు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎరువుల దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని బద్వేల్ డివిజన్ వ్యవసాయం సహాయ సంచాలకులు ఎం.నాగరాజ హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్, స్టాక్ వివరాలు, ధరల బోర్డ్, బిల్లులు, ఇన్వాయిస్, వే బిల్లులు, ఫార్మ్ ఒ, తూకాలు, స్టాక్ రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల సక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎమ్మార్పీకి నాణ్యమైన సరుకు రైతులకు ఇవ్వాలన్నారు. గడువు ముగిసిన పురుగు మందులను అమ్మరాదని హెచ్చరించారు. స్టాక్ నిల్వ, అమ్మకపు ధరలు, లైసెన్స్ వివరాలు షాప్ అవరణలో ప్రదర్శించాలన్నారు. అమ్మిన సరుకునకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనంతరం రావులపల్లి, చెన్నముక్కపల్లి రైతు భరోసా కేంద్రాలను కూడా తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్ర్యమంలో మండల వ్యవసాయ అధికారి నాగార్చన, రైతు భరోసా కేంద్ర సహాయకులు ప్రశాంత్, మాధురి, రేష్మ పాల్గొన్నారు.

మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అందరి సహకారంతో మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదామని ఎంపిడిఒ సాల్మన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో యుపిఆర్‌డి పద్మనాభరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వచ్చే ఎన్నికల్లో వైసిపిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీలోని కె.ఎల మవారిపల్లెలో వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా వైఎస్ మనో హర్‌రెడ్డి ప్రభుత్వ పథకాలకు సంబం ధించి ఏర్పాటు చేసిన కరపత్రాలను ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాల నుంచి ప్రజలు పొందిన లబ్ధికి సంబంధించి ఆ కరపత్రాల్లో పొందు పరిచారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. జగనన్న పథకాలు పేద ప్రజలు అభివృద్ధికి దోహద పడుతాయన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ రంగనాయకులు, విజయ్ నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న మనోహర్‌రెడ్డి

న్యాయస్థానంపై గౌరవం లేని అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం వేంపల్లెలో ప్రభత్వ అధికారులకు న్యాయస్థానంపై గౌరవం లేకుండా పోయిందని టిడిపి మండల కన్వీనర్ ఎస్. రామమునిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం ఆర్‌టిసి అధీనంలో ఉన్న దుకాణాలకు చెందిన రేకులను రోడ్డు భవనాల శాఖ అధికారులు తొలగించడంతో ఆ దుకాణలను టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణ నేపంతో ఆర్‌టిసి ఆధీనంలో ఉన్న దుకాణానికి సంబంధించిన రేకులు, గోడలను పగులగొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కోర్టులో ఉన్న దానికి ఒక వారం రోజులు ముందు నోటీసులు ఇవ్వకుండా అర్ధంతరంగా పగుల కొట్టడం దారుణమన్నారు. 2024 సెప్టెంబర్ వరకు గడువు ఉన్నా అధికార పార్టీ నాయకుల మెప్పు పొందేందుకు అధికారులు ఈ పని చేయడం దుర్మార్గమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణంలో వ్యాపారం చేసుకుంటున్న గాలి శ్రీనువాసులు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. నష్టం జరిగిన దానికి అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ ఎస్పీ జయచంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, అలిరెడ్డిపల్లె బాలకృష్ణా రెడ్డి, రామకృష్ణారెడ్డి, వేమకుమార్, మహమ్మద్, డక్కా శ్రీనివాసులు, పోతిరెడ్డి శివ పాల్గొన్నారు.

రేకుల షెడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజలతో భూపేష్‌రెడ్డి, నాయకులు

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిర్రాజుపల్లి, దండుపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోలోని అంశాలను ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు వివరించారు. టిడిపి హయాంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. టిడిపి పాలనలో ఏ ఒక్క రంగం కూడా నష్టపోలేదని తెలిపారు. వైసిపి పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని పేర్కొన్నారు. టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిన్నబాల్‌రెడ్డి, వరప్రసాదు, రమేష్, హరికుమార్, అనిల్‌కుమార్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, మునిస్వామి నాయుడు, సురేష్ నాయుడు, సుబ్బయ్య నాయుడు, భక్తాంజనేయులు, రామాంజనేయులు, ఫకీరయ్య, పెద్దయ్య, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు బాధిస్తున్నాయి

- టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గురువారం తన కన్న తల్లిపై ప్రతిపక్షంతో చేసిన వ్యాఖ్యలు తనను ఎంతగానో బాధిస్తున్నాయని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా, మహిళ లోకాన్ని కించపరిచేలా ఎమ్మెల్యే రాచమల్లు వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే రాచమల్లు మాటలను తప్పుగా భావిస్తున్నానని అన్నారు. ప్రొద్దుటూరు మహిళలు అందరి తరపున ఎమ్మెల్యే తన తల్లికి క్షమాపణలు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇకపైనా ఇలాంటి మాటలు మానుకోవాలన్నారు. ఇకపై తన, తన కుటుంబ సభ్యుల గురించిగానీ, తన వ్యాపారాల గురించిగానీ ఎమ్మెల్యే మాట్లాడితే సహించబోనని హెచ్చరించారు. సీనియర్ టిడిపి నాయకులు ఐవి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు అధికారంలోకి వచ్చాక ప్రొద్దుటూరులో అవినీతి పరాకాష్టకు చేరిందన్నారు. పట్టణ అధ్యక్షులు జిలేవుల్లా మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన నిరంతర ప్రక్రియని తమ టిడిపి ప్రభుత్వ హయాంలో కూడా నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో రూ.40వేల ఓట్ల తేడాతో ఎమ్మెల్యే రాచమల్లు ఓడిపోనున్నారని తెలిపారు. సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన జ్యేష్ఠా ఆశీర్వాదం వారి అనుచర వర్గం శుక్రవారం మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన మైదుకూరు ఇన్‌ఛార్జి మల్లోత్ర, మండల కన్వీనర్ బోర్రెడ్డి రమణారెడ్డి, పాపిరెడ్డి రాంబాబు, కారుపర్తి సంజీవరెడ్డి, చీదిర నరసింహ రాయల్, మండల నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

క్రైం కార్నర్

126 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 126 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చాంద్ బాషా తెలిపారు. ఎస్‌పి సిద్ధార్థ కౌశిల్, పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం తాళ్లపల్లె గ్రామంలో చికెన్ దుకాణం నడుపుతున్న పగిడిపల్లె బాబావలి దుకాణాన్ని సిఐ చాంద్ బాషా, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. పగిడిపల్లె బాబావలిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 126 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సిఐ విలేకరులతో మాట్లాడుతూ టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన పగిడిపల్లె బాబావలి తాళ్లపల్లెలో చికెన్ దుకాణం పెట్టుకొని వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. బాబావలిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. అక్రమం మద్యం పట్టివేతలో చొరవ చూపిన కానిస్టేబుళ్లకు ఎస్పీ ఆదేశాల మేరకు రివార్డు అందజేసినట్లు సిఐ వివరించారు.

మద్యం బాటిళ్లతో సిఐ, ఎస్ఐ

పోలేరమ్మ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని పోలేరమ్మ గుడిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగలగొట్టి భక్తులు సమర్పించిన కానుకలను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం గేటుకు వేసిన తాళం పగిలి ఉండడంతో పలువురు అనుమానించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణలో ముమ్మరం చేశారు. 2023 నవంబర్ 20న పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట జరిగినప్పటి నుండి నేటి వరకు పోలేరమ్మ వద్ద హుండీని తెరవలేదు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగలగొట్టి భక్తుల కానుకలను అపహరించారు. ఈ సందర్భంగా భక్తులకు దర్శనం నిలిపేశారు. క్లూస్ టీం పరిశీలించింది.

దుండగులు పగులగొట్టిన హుండీ

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

జాతీయ రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

35వ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహం సర్కిల్ నుండి కొత్త ఆర్‌టిసి బస్టాండ్ వరకు ఎంవిఐ బివి ప్రసాద్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగం అత్యంత ప్రమాదకరం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌టిసి డిపో మేనేజర్ రామకృష్ణ, అర్బన్ ఎస్ఐ హుస్సేన్‌బాషా, ఆర్‌టిసి అధికారి శ్రీకాంత్, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట తహశీల్దార్ ఉదయ భారతిని సిబ్బంది శుక్రవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆమె బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళుతున్న సందర్భంగా రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు. నూతన తహశీల్దార్‌గా ఆదోనిలో పని చేస్తున్న వెంకటలక్ష్మి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉదయభారతిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ పి.మహబూబ్ బీ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన సాధారణ బదిలీలో కలసపాడు నుంచి ఆమె చాపాడుకు బదిలీ అయ్యారు. ఆ మేరకు మహబూబ్ బీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీధర్ నాయుడును చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆమె కార్యదర్శులకు సూచించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోలర్ రిలే స్కేటింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరి చారని పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయ చంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవాలో జరిగిన అండర్-8 రిలే విభాగంలో రెండవ తరగతికి చెందిన దీక్షిత్ రెండు గోల్డ్ మెడల్ సాధించారని, అలాగే అండర్-10 విభాగంలో నక్షత్ర 2 సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్, పి.మోక్షజ్ఞ 2 సిల్వర్ మెడల్స్‌తో సత్తా చాటారని తెలిపారు. ఈ విద్యార్థులు త్వరలో శ్రీలంకలో జరగబోయే అంతర్జాతీయ స్కేటింగ్ విభాగంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ వారిని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్ర, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పతకాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేయాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేయాలని ఎపి అధికార భాష సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య సూచించారు. మఠంలోని బాలుర వసతి గృహం, ఎంఇఒ కార్యాలయం, ప్రభుత్వ బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో హాజరు పట్టికలు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే రాసేలా ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలని విద్యాశాఖ అధికారికి తెలిపారు.

9వ రోజుకు చేరుకున్న దీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత్ నగర్‌లో కనీస వసతులు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తుంటే అధికారులు పట్టించుకోలేదన్నారు. వీరు ఇలాగే ఉంటే సోమవారం తహశీల్దార్ కార్యాల యానికి తాళం వేస్తామని ఆయన హెచ్చరించారు. పేదల స్థలాలను కబ్జా చేసి అమాయక ప్రజలకు అమ్ముతూ కోట్లు గడిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేయాలన్నారు. ధర్నాలో లత, పద్మావతి, సువాసిని, హసీనా, అయ్యవారెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో శుక్రవారం ఎర్రగుంట్ల వాటర్ షెడ్ ప్రాజెక్టులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పులివెందులకు చెందిన రేగడ్డ వెంకటసుబ్బయ్య తన కుమార్తె జ్ఞానశ్రీ మొదటి పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర సరుకులు అందజేశారు. ముఖ్యఅతిథిగా గూడూరు గురుప్రసాద్, రోటరీపురం కౌన్సిలర్ గాజుల బాబయ్య చిన్నారి బర్త్ డే కేక్ కట్ చేసి విభిన్నప్రతిభావంతులకు పంపిణీ చేశారు. అనంతరం 30 మందికి బియ్యం, సరుకులు అందజేశారు. విశిష్టఅతిథిగా ఎర్రగుంట్ల వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కళ్యాణి, విశ్రాంత లయోలా అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డితోపాటు పలువురు జ్ఞానశ్రీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, పులివెందుల ఉపాధి హామీ ఎపిడి సుబ్బారెడ్డి, వాటర్ షెడ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రఘునాథరెడ్డి, జూనియర్ ఇంజనీర్ రమాదేవి, ప్రతాప్, సంఘ కార్యవర్గ సభ్యులు సునీల్, గంగయ్య, బంధుమిత్రులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు